


దుమ్ముగూడెంలో నేలమట్టమైన వరి

నమస్తే తెలంగాణ

ఖమ్మం

10 | ఖమ్మం, శనివారం 5 ఏప్రిల్ 2025 | KHAMMAM

# వక్ఫ్ బిల్లును రాజ్యసభలో వ్యతిరేకించాం..

**బీఆర్ఎస్ ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర**



మాట్లాడుతున్న రవిచంద్ర, చిత్రంలో సురేశ్‌రెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 4: వక్ఫ్ సవరణ బిల్లును రాజ్యసభలో తాము వ్యతిరేకించామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేశ్‌రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ముస్లింల మనోభవాలను తమ పార్టీ మొదటి నుంచీ గౌరవిస్తున్నదని, ఎప్పటికీ గౌరవిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ముస్లింలకు వ్యతిరేకమైన వక్ఫ్ సవరణ బిల్లును బీఆర్ఎస్ రాజ్యసభలో వ్యతిరేకించిందని తెలిపారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు సంఖ్యా బలం తక్కువ ఉన్నప్పటికీ ప్రజల పక్షాన పోరాటంలో ముందడుగులో ఉన్నామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్నామని అన్నారు.

# అకాల వర్షం.. ఆగమాగం



అన్నపురెడ్డిపల్లిలో పూర్తిగా దెబ్బతిన్న వరి



- భద్రాద్రి జిల్లాలో అకాల వర్షంతో దెబ్బ తిన్న వరి, మిర్చి పంటలు
- ఆరబోసిన మిర్చి, ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్నదాతల పాట్లు
- పలు మండలాల్లో నేలకొరిగిన వరి పంట, తడిసిన మొక్కజొన్న
- శుక్రవారం పంటలను ఆరబెడుతూ కన్నీరు పెట్టుకున్న రైతులు
- క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని వేడుకోలు
- ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన సరుకు కొనాలని విజ్ఞప్తి

పంట పండించే రైతులపై ప్రకృతి పగబట్టింది. పంట వేసినప్పటి నుంచి సాగునీరు అందక.. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకుంటూ వస్తున్నా తీరా చేతికొచ్చే సమయంలో పరీక్ష పెడుతున్నది. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను నేలపాలు చేసి అపార నష్టాన్ని మిగిల్చింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి, ధాన్యం తడిసిముద్దయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో రాత్రి పూట ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు ఆరబెట్టిన ధాన్యం, మిర్చి పంటలపై టార్పాలిన్లు కప్పుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. కోత దశలో ఉన్న వరి, ఏరే దశలో ఉన్న మిర్చి చేలల్లోనే తడిసిపోయాయి. పలుచోట్ల వడ్లు రాలి నీటిపాలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామునే పంట పొలాలు, కల్లాల వద్దకు చేరుకున్న రైతులు వాటిని చూసిన కన్నీరు పెట్టుకున్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే అకాల వర్షం అపార నష్టాన్ని తెచ్చిపెట్టిందని ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 4



## తడిసిన మిర్చి

చర్ల, ఏప్రిల్ 4: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి అకాల వర్షంతో తడిసిపోయింది. అసలే గిట్టుబాటు ధర లేక దిగులు చెందుతున్న రైతులపై అకాల వర్షం మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు చేసింది. వర్షానికి మిర్చి పంట తడవడంతో మార్కెట్‌లో ధర కూడా పలకదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తడిసిపోయిన మిర్చి పంటను ఆరబెట్టే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.



### ధర తగ్గుతుంది..

నా పేరు బట్టా నవీన్. నేను ఈ యేడాది ముమ్మడివరం గ్రామంలో 20 ఎకరాల్లో మిర్చి పంట వేశాను. ఎకరానికి రూ.2 లక్షల వరకు ఖర్చు అయింది. తెగుళ్లతో పంట దిగుబడి తగ్గింది. మార్కెట్‌లో క్వింటా రేటు రూ.10 వేల వరకు ఉంది. ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. అంతేకాక తోటలో ఏరిన మిర్చిని కల్లంలో ఆరబెట్టాను. బరకాలు కప్పినా అకాల వర్షంతో మిర్చి తడిచింది. కాయ రంగు మారే ప్రమాదం ఉంది. దీనికి మార్కెట్‌లో పెద్దగా రేటు పలకదు. ఏం చేయాలో తోచడం లేదు. ఈ యేడాది కనీసం రూ.3 లక్షల వరకు నష్టం వచ్చేలా ఉంది.

## తడిచిన మిర్చిని తిరగేస్తూ..



టేకులపల్లి, ఏప్రిల్ 4: అకాల వర్షం కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంటను ముద్ద చేసింది. టేకులపల్లి, కోయగూడెం, సులానగర్, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు, కొత్తతండా, బోడు, సంపత్‌నగర్, బేతంపూడి, తొమ్మిదోమైలుతండా తదితర గ్రామాల్లో ఏరిన మిర్చి పంటను కల్లాల్లో ఆరబెట్టడంతో వర్షంతో తడిసిపోయింది. ఎండబెట్టిన మిర్చిని కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పి రైతులు నానా పాట్లు పడ్డారు. కొన్నిచోట్ల చేతికొచ్చిన మొక్కజొన్న తడిసిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి టార్పాలిన్లపై నిలిచిన నీటిని తొలగించే పనిలో పడ్డారు. తడిసిన పంటను ప్రభుత్వమే కొనాలని, పరిహారం అందించాలని కోరారు.

## నేలవాలిన వరి, ముద్దయిన మిర్చి





పెనుబల్లి, ఏప్రిల్ 4: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు అయోమయానికి గురయ్యారు. మండాలపాడులో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. తాళ్లపెంట, సూరయ్య బంజరతండాలో చేతికొచ్చిన వరి పైర్లు నేలకొరిగాయి. లంకపల్లి, కొత్త కారాయిగూడెం, పాతకారాయి గూడెం, గోంద్రుపాడు, టేకులపల్లి గ్రామాల్లో వరి పంటలు కోయడంతో నీటిలో తడిసి ముద్దయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి మిర్చి, వరి పంటలను ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.





## మిరప నేలపాలు..

చంద్రుగొండ, ఏప్రిల్ 4: గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన అకాల వర్షం మిర్చి రైతులను కోలుకోకుండా చేసింది. కల్లాల్లో ఆరబెట్టిన మిరప కాయలు తడిసిపోయాయి. కొన్నిచోట్ల పరదాలు కప్పి పంటను కాపాడుకున్నారు. వర్షంతోపాటు గాలులు వీచడంతో తోటలో చెట్లపై ఉన్న కాయలు రాలిపోయాయి. వాటిని చూసిన రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను అధికారులు సర్వే చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## పాల్వంచలో దెబ్బతిన్న వరి

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని తోగ్గూడెం, తోగ్గూడెంతండాల్లో వీచిన బలమైన గాలులు, వర్షానికి కొన్నిచోట్ల వరి పనలు నేలకొరిగాయి. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట తడిసి ముద్దయింది. చేతికొచ్చిన పంట తడిసిపోవడంతో పెట్టుబడి అంతా నీటిపాలైందని, పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలని మదనపడుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి పంట కూడా తడిసిపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు.



## గాలివీచి.. నేలవాలి..



దుమ్ముగూడెం, ఏప్రిల్ 4: మండలంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో అకాల వర్షం కురిసింది. ఇప్పటికే కోత కోసిన వరి పంట రంగుమారుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. కోతకొచ్చిన పంట నేలవాలడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మళ్లీ వర్షం వస్తే వరికి ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి సైతం తడిసిపోయిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

## రాశుల మీద పరదాలు



తిరుమలాయపాలెం, ఏప్రిల్ 4: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా వర్షం కురిసింది. మండలంలోని తిరుమలాయపాలెం, వెదుళ్లచెరువు, పిండిప్రోలు, కొక్కిరేణి, తెట్టెలపాడు, దమ్మాయిగూడెం, పాపాయిగూడెం గ్రామాల్లో కురిసిన వర్షానికి.. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్నలు తడిచిపోయాయి. దీంతో రైతులందరూ పరుగున వెళ్లి మిర్చి రాశులు, మొక్కజొన్న రాశుల మీద పరదాలు కప్పారు.

## కంటికి రెప్పలా కాపాడుకునేలా..



అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 4: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి కురిసిన వర్షం, ఈదురు గాలులకు వరి పైరు నేలకొరిగింది. మర్రిగూడెం, అబ్బుగూడెం, రాజాపురం, ఊటుపల్లి, పెంట్లం గ్రామాల్లో వరి పైరు వర్షాలకు దెబ్బతిన్నది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లముందే దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## మొక్కజొన్న నీళ్లపాలు



వైరా టౌన్, ఏప్రిల్ 4: అకాల వర్షం కారణంగా వైరా మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో రైతులకు అపార నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం కారణంగా తడిచిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సర్వే నిర్వహించి రైతుకు నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.









ఇల్లెందులో ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

# ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగుల ధర్నా

**సమస్యలు పరిష్కరించాలంటూ డిమాండ్**

మధిర/ ఇల్లెందు, ఏప్రిల్ 4: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు మధిర, ఇల్లెందు ఆర్టీసీ డిపోల ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులు భిక్షపతి, ఫకీరయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఏళ్లతరబడి పనిచేసి ఉద్యోగ విరమణ పొందినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్డు ఉద్యోగులకు నూతన పే స్కేల్ విధానాన్ని అమలు చేయాలని, రిటైర్డు అయిన ఉద్యోగులకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు.





మధిర డిపో ఎదుట..

# ఖమ్మం ఔన్నత్యాన్ని కాపాడుతా..

- పదేళ్లలో నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానన్న సంతృప్తి ఉంది
- 'ఈద్ మిలాప్'లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్





ఈద్ మిలాప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, ఏప్రిల్ 4: ఖమ్మం ఔన్నత్యాన్ని కాపాడడంలో ఎల్లప్పుడూ ముందుంటానని, పదేండ్లు ప్రజలిచ్చిన అవకాశంతో ఖమ్మం నియోజకవర్గ చరిత్రలో లేనివిధంగా పనిచేశానని, చాలా సంతృప్తిగా ఉన్నానని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని షాదీఖానా ఆవరణలో శుక్రవారం జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితులు ఎదురైన ప్రతి సందర్భంలోనూ ఖమ్మంలో తనకంటే ముందు పనిచేసిన ఎమ్మెల్యేల పనితీరును తెలుసుకొని మసలుకుంటానన్నారు. ఖమ్మం నగరానికి ఖిల్లా ఎంత గట్టిగా ఉందో తన మనస్సులో అల్లా కూడా అదేవిధంగా ఉంటారని అన్నారు. పీస్ కమిటీ చైర్మన్ జడ్ సుధాకర్, సీనియర్ న్యాయవాది కొల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మక్బుల్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, మైనార్టీ విభాగ అధ్యక్షుడు తాజుద్దీన్, మతపెద్దలు ఆఫీజ్, ఘనీ, సుజాఉద్దీన్ పాల్గొన్నారు.



హాజరైన మైనార్టీ విభాగ నేతలు





ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

# 'కార్పొరేషన్'లో విలీనం వద్దు

- మా పొట్టకొట్టే మున్సిపల్ కార్పొరేషన్ మాకసలే వద్దు
- సుజాతనగర్‌లో ఏడు విలీన పంచాయతీల ఈజీఎస్ కూలీల ర్యాలీ
- 'ఉపాధి హామీ' పనులకు దూరమవుతామని కార్మికుల ఆందోళన

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 4: 'మా పొట్టకొట్టే కార్పొరేషన్ మాకొద్దు' అంటూ సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీల పరిధిలో గల ఉపాధి హామీ కూలీలు కార్పొరేషన్ విలీన వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏడు గ్రామ పంచాయతీలు సుజాతనగర్, నాయకులగూడెం, లక్ష్మీదేవిపల్లి, కోమటిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నర్సింగ్ సాగర్ పంచాయతీల నుంచి తరలివచ్చిన ఉపాధి హామీ కూలీలు 'మా పొట్టకొట్టొద్దు.. మా జీవితాలను ఆగం చేయొద్దు' అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా కాట్రాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో పోరాట కన్వీనర్ కున్సోత్ ధర్మ మాట్లాడుతూ ఏడు పంచాయతీల పరిధిలో సుమారు 5 వేల మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారని, వీరంతా వంద రోజుల పని చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఆయా గ్రామాలను మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తే వీరికి ఉపాధి హామీ పనులు ఉండవని, ప్రభుత్వం వెంటనే కార్పొరేషన్ ఆలోచనను విరమించుకోవాలని, లేదంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.